సాక్షి
కాకినాడ

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



8 లో

స్థలం పట్టాలే పాట్టన పెట్టుకున్నాయా!


సామర్లకోట మండలం పేట్లపాలెం గ్రామంలో ఇళ్ల స్థలాల పట్టాల విషయమై ఎనిమిదేళ్ల క్రితం వివాదం తలెత్తి సద్దుమణిగిపోగా, నేడు రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం హత్యలకు దారి తీసింది.



మామిడి పూతకు మంచు కోత

రాత్రి వేళల్లో కురుస్తున్న మంచు, తరచూ సంభవిస్తున్న తుపాన్ల ప్రభావంతో సోకుతున్న తెగుళ్లు, ఆశిస్తున్న పురుగుల కారణంగా మామిడి తోటలపై రైతులు అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది.

డెల్టాలకు 12,400 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 12,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీనిలో తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రతి వారం వస్తున్న అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార పురోగతిపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలసి కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్షించారు. జిల్లాలో శాఖల వారీగా మొత్తం అర్జీలను పర్యవేక్షించేందుకు డీపీఎం ఎస్‌డీసీ నోడల్ అధికారిగా ప్రత్యేక బృందాన్ని నియమించామన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి జేసీ నేతృత్వంలో జిల్లా రెవెన్యూ అధికారి, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీఓలు పర్యవేక్షించాలన్నారు. అలాగే, ఎంపీడీవోలకు సంబంధించిన అర్జీలను జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపాలిటీ పరిధిలోని అర్జీలను సమగ్ర శిక్షా ఏపీసీ, ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలను జిల్లా పరిషత్ సీఈఓ పర్యవేక్షించి, పరిష్కార నాణ్యతను పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, సీపీఓ పి.త్రినాథ్, కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, డీపీఎం ఎస్‌డీసీ వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా ఏపీసీ పి.వేణుగోపాల్, కాకినాడ డీఎల్‌డీఓ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 429 అర్జీలు

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 429 అర్జీలు సమర్పించారు. కలెక్టరేట్ వివేకానంద హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి వివిధ సమస్యలపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, సీపీఓ పి.త్రినాథ్ తదితరులు అర్జీలు స్వీకరించారు. వీటిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను జేసీ ఆదేశించారు. పరిష్కరించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

కలెక్టర్, ఎస్పీలను కలసిన అన్నవరం ఈఓ



కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలసిన ఈఓ సుబ్బారావు

అన్నవరం: స్థానిక వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నూతన ఈఓ వి.సుబ్బారావు.. కలెక్టర్ షణ్మోహన్ సగిలిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పిఠాపురంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయనను కలిసి సత్యదేవుని ప్రసాదం అందజేశారు. అలాగే కాకినాడలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

సత్యదేవుని ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

అన్నవరం: రత్నగిరివాసుడు సత్యదేవుని ధనుర్మాసోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ధనుర్మాసంలో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకూ సత్యదేవుడు, అమ్మవారిని అన్నవరంలో ఊరేగించి తిరిగి స్వామివారి ఆలయానికి చేర్చడం ఆనవాయితీ. దీనిలో భాగంగా సోమవారం అన్నవరంలో స్వామివారి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఉదయం ఏడు గంటలకు పల్లకీలో స్వామి, అమ్మవార్లను ఊరేగింపుగా కొండ దిగువన తొలి పావంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ సంక్రాంతి వరకూ ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ధనుర్మాస గ్రామోత్సవంలో పాల్గొనేందుకు గాను వంద మంది దేవస్థానం ఉద్యోగులకు ప్రత్యేక డ్యూటీలు వేశారు. పదేసి మంది ఉద్యోగులు విడతల వారీగా రెండురోజుల చొప్పున ఈ విధుల్లో పాల్గొనాలని అధికారులు ఆదేశించారు.

రేపు డీఆర్‌సీ సమావేశం

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు జిల్లా సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరి నారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని వివరించారు.

ఎయిర్‌పోర్ట్..

కూటమి ఫైట్!



ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదిస్తున్న పచ్చని పంట పొలాలు

అక్కడ ఎయిర్‌పోర్టు వస్తే తమ బంధుగణం భూముల ధరలకు రెక్కలు వస్తాయనే ఆశ ఒక నేతది.. ఆయనకు చెక్ పెట్టాలనే వ్యూహం మరొకరిది.. విమానాశ్రయం పేరుతో తమకు జీవనాధారంగా ఉన్న భూములు లాక్కోవద్దనే వేదన బాధిత రైతులది.. వెరసి ప్రతిపాదిత అన్నవరం ఎయిర్‌పోర్టు ఏర్పాటు వ్యవహారం సందిగ్ధంలో పడింది.

- విమానాశ్రయంపై కూటమి నేతల్లో విభేదాలు!
- బెండపూడి బెటర్ అంటున్న యనమల
- ఖాళీ భూములకే సై అంటున్న ఎంపీ తంగెళ్ల
- పొలాలు ఇచ్చేది లేదంటున్న రైతులు
- సందిగ్ధంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు



వ్యవసాయం ముద్దు-విమానాశ్రయం వద్దు అంటూ బెండపూడిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికార కూటమిలోని ఇద్దరు నేతల మధ్య అన్నవరం విమానాశ్రయం ప్రతిపాదన పితలాటకంగా మారింది. ఇక్కడే ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని కావాలని ఒకరు, వద్దని మరొకరు పట్టుబడుతున్నారు. ఫలితంగా విమానాశ్రయ భూ సేకరణపై సందిగ్ధత నెలకొంది. తొండంగి మండలం అన్నవరం – బెండపూడి మధ్య విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదన ఇటీవల తెర పైకి వచ్చిన విషయం తెలిసిందే. కోల్‌కతా – చెన్నై 16వ నంబర్ జాతీయ రహదారి సమీపాన ప్రతిపాదించిన ఈ ఎయిర్‌పోర్టుకు ప్రాథమికంగా 757 ఎకరాలు అవసరమని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్ధారించింది. దీనికోసం బెండపూడి, పీఈ చిన్నాయిపాలెం గ్రామాల పరిధిలో భూ సేకరణకు ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్టు సాధ్యాసాధ్యాలపై ఈ నెల 25లోగా అధ్యయనం పూర్తి చేసి ఏఏఐకి నివేదించాల్సి ఉంది. దీనికోసం ప్రభుత్వం ఇటీవల నిధులు కూడా విడుదల చేసింది.

యనమల మొగ్గు అందుకేనా?

అన్నవరం ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు టీడీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఆయన బంధుగణం, అనుచరుల భూములు ఉండటమే దీనికి కారణమని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు యనమల ప్రతిపాదించారు. ఈ ఉద్దేశంతోనే ఆయన అప్పట్లో అన్నవరం గ్రామాన్ని దత్తత తీసుకున్నారని కూడా పలువురు అంటున్నారు. గతంలో కాకినాడ స్పెషల్ ఎకనమిక్ జోన్ (కేఎస్ఈజెడ్) భూ సేకరణకు శ్రీకారం చుట్టిన సమయంలో యనమల సమీప బంధుగణమే మొట్టమొదట భూములు రిజిస్ట్రేషన్ చేశారని చెబుతున్నారు. దీంతో తమ భూములకు ఇక దిక్కెవరని భావించిన ఆ ప్రాంతంలోని రైతులు గత్యంతరం లేక అప్పట్లో భూములు ఇచ్చారని అంటున్నారు. ఇప్పుడు ఎయిర్‌పోర్టు భూ సేకరణలో కూడా అదే జరుగుతుందని అనుమానిస్తున్నారు.

ప్రతిపాదిత ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రాకపోకల కంటే సరకుల రవాణాకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేఎస్ఈజెడ్ పరిధిలో ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించిన దివీస్, ఇటీవలే ఉత్పత్తి ప్రారంభమైన లీఫియస్‌తో పాటు గేట్‌వే పోర్టు ఆఫ్ కాకినాడ నుంచి విదేశాలకు ఎగుమతులు చేసేందుకే ఈ ఎయిర్‌పోర్టు అని చెబుతున్నారు. సమీప ప్రాంతాల్లో గోడౌన్లు, ఫెసిలిటేట్ సెంటర్ల ఏర్పాటుకు అవకాశం ఉందనే ముందుచూపుతోనే ఇక్కడే ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని యనమల వర్గీయులు పట్టుబడుతున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.

ఎంపీ ప్రకటనలో మర్మమేమిటో!

ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి ఇటీవల ఢిల్లీకి విమాన సర్వీసు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతుల పంట భూముల్లో కాకుండా ఖాళీ భూముల్లో అన్నవరం ఎయిర్‌పోర్టును ప్రతిపాదించాలని అన్నారు. పైగా ఈ ప్రతిపాదన ఉప ముఖ్యమంత్రి పవన్‌దని చెప్పుకొచ్చారు. అది పవన్ అభిప్రాయమా లేక పవన్ పేరిట ఎంపీ అభిప్రాయమా అనేది వారికే తెలియాలి. ఎంపీ వ్యాఖ్యలు కూటమి నేతల మధ్య చిచ్చు రేపాయి.

అయితే, బీసీలకు అన్యాయం జరిగిందంటూ ఇటీవల అధిష్టానాన్ని ఇరుకున పెట్టేలా చంద్రబాబుకు యనమల లేఖ రాసిన సంగతి తెలిసిందే. అలాగే, సెజ్ భూ సేకరణకు సంబంధించి కాకినాడ సీపోర్టు అధినేత, సెజ్ ప్రమోటర్లలో ఒకరైన కేవీ రావు చొదరిపై చంద్రబాబు మనోగతానికి భిన్నంగా ఆయన ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు చెక్ పెట్టేందుకే అధిష్టానం జనసేన ఎంపీ తంగెళ్ల ద్వారా ఎయిర్‌పోర్టు భూములపై ఈ ప్రకటన చేయించిందనే వాదన కూడా వినిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన, భూ సేకరణపై సందిగ్ధత ఏర్పడింది. యనమల, ఎంపీ తంగెళ్ల మధ్య ఎవరి పంతం నెగ్గుతుందో వేచి చూడాల్సిందే.

రైతుల ఆందోళన

ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సేకరించదలచిన భూములన్నీ తాత ముత్తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న జిరాయతీ భూములే. రెవెన్యూ యంత్రాంగం నివేదికల ప్రకారం ఎకరం, రెండెకరాలు కలిగిన 1,220 మంది సన్న, చిన్నకారు రైతులు ఈ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే తాము భూములు, జీవనాధారం కోల్పోతామని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాంత రైతులు పోలవరం ఎడమ కాలువ, పంపా రిజర్వాయర్, జాతీయ రహదారి, పుష్కర ఎత్తిపోతల పథకాల కోసం రెండు పంటలు పండే ఐదారు వందల ఎకరాల భూములు ఇచ్చారు. ఇప్పుడు మరోసారి భూములు ఇవ్వాల్సి వస్తే ఊళ్లు ఖాళీ చేసి, వలస పోవాల్సిందేనే ఆవేదనతో వారు ఎయిర్‌పోర్టు భూ సేకరణను వ్యతిరేకిస్తున్నారు. వీరందరూ ఏబీసీ (అన్నవరం, బెండపూడి, చిన్నాయిపాలెం) రైతు సంఘంగా ఏర్పడి, ఎయిర్‌పోర్టును మరో చోటకు తరలించాలంటూ ఉద్యమిస్తున్నారు. ఇందులో భాగంగా దశలవారీ ఆందోళనలు కూడా నిర్వహిస్తున్నారు. 'విమానాశ్రయం వద్దు – వ్యవసాయం ముద్దు' అంటూ గ్రామాల్లో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. పచ్చని పొలాల్లో ఎయిర్‌పోర్టు తీసుకువచ్చి తమ పొట్ట కొట్టవద్దని డిమాండ్ చేస్తున్నారు.



ఎయిర్‌పోర్టు వద్దంటూ బెండపూడిలో ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

సెజ్‌లోకి మార్చండి



ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదించిన భూముల్లో మాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. దీనికి మార్కెట్లో ఎంతో విలువ ఉంది. అయినప్పటికీ మేము వ్యవసాయం మీద ఆధారపడి భూములు సాగు చేసుకుంటున్నాం. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. ఈ ప్రతిపాదనను కాకినాడ సెజ్‌లో ఖాళీగా ఉన్న ప్రాంతంలోకి మార్చుకుంటే బాగుంటుంది.

– ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి, రైతు, బెండపూడి

ఎయిర్‌పోర్టు వద్దు



పుష్కర కాలువకు రెండెకరాల పొలం ఇచ్చాం. ఇప్పుడు ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదించిన భూముల్లో ఎకరా 80 సెంట్లు ఉంది. వ్యవసాయమే జీవనాధారంగా తాతముత్తాతల నుంచి జీవిస్తున్నాం. ప్రభుత్వం ఎయిర్‌పోర్టు మరోచోట ఏర్పాటు చేసుకోవాలి. ఎయిర్‌పోర్టు వద్దు.. వ్యవసాయమే ముద్దు. మా పొట్ట కొట్టొద్దు.

– గొంతెన నాగేశ్వరరావు, రైతు, బెండపూడి

జీవనాధారం పోతుంది



నాకు ఒకటిన్నర ఎకరాల పొలం ఉండేది. గతంలో పుష్కర కాలువకు పాతిక సెంట్ల భూమి ఇచ్చాం. మిగిలి ఉన్న ఎకరా పాతిక సెంట్లు ఎయిర్‌పోర్టుకు కావాలంటున్నారు. నాకు ఇద్దరు కుమారులు. ఒక్కొక్కరికి ముగ్గురేసి ఆడపిల్లలు. అందరం ఈ ఎకరా పాతిక సెంట్ల భూమిపై వచ్చే ఆదాయంతో పాటు కూలినాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఉన్న కాస్త భూమి ఎయిర్‌పోర్టుకు పోతే జీవనాధారం కోల్పోతాం.

– ములికి అర్జున్, రైతు, పీఈ చిన్నాయపాలెం

ఇప్పుడు మళ్లీ ఇవ్వాలా?



పుష్కర కాలువ కోసం మేము నాలుగెకరాల భూమి ఇచ్చాం. ఇప్పుడు రెండున్నర ఎకరాలు ఎయిర్‌పోర్టుకు తీసుకుంటామని ప్రతిపాదిస్తున్నారు. ఇప్పటికే భూములు కోల్పోయిన మా నుంచి మిగిలి ఉన్న భూములు కూడా తీసుకోవాలనుకోవడం అన్యాయం.

– రాయవరపు ఆనంద్, రైతు, బెండపూడి

ఆశగా సాగుతూ..

- రైతులకు కలసిరాని ఖరీఫ్
- రబీకి రైతుల సన్నాహాలు
- సిద్ధమవుతున్న నారుమడులు



ఊడ్పులకు వీలుగా ట్రాక్టర్‌తో దమ్ములు

కాకినాడ సిటీ: ఖరీఫ్ ప్రారంభంలో తీవ్ర వర్షాభావం, ఆగస్టు నుంచి భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని, దిగుబడి పడిపోయి జిల్లా రైతులు నష్టపోయారు. చాలాచోట్ల ఎకరాకు 30 బస్తాలకు మించి ధాన్యం దిగుబడి రాలేదు. మరోవైపు ప్రభుత్వ విధానాల పుణ్యమా అని దళారీల జోక్యం పెరగడంతో గిట్టుబాటు ధర దక్కలేదు. బస్తా ధర రూ.1,400 లోపే ఉండటంతో పెట్టుబడి దక్కడం కూడా గగనమై, రైతులు మరింత నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో రబీ సాగుకు ఆశతో సన్నాహాలు చేసుకుంటున్నారు. కోతలు పూర్తయిన పొలాల్లో వెంటనే బురద సేద్యం ఆరంభిస్తున్నారు. రెండో పంటయినా దక్కాలనే ఆశతో రబీ సాగుకు సన్నాహాలు చేస్తున్నారు. కరప, కాకినాడ రూరల్, తాళ్లరేవు, పెదపూడి, జగ్గంపేట, ఏలేశ్వరం, సామర్లకోట, పెద్దాపురం తదితర మండలాల్లోని గ్రామాల్లో రైతులు నాట్లు, వెదజల్లు సాగుకు వీలుగా ట్రాక్టర్లతో పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 97 వేల హెక్టార్లలో వరి సాగు జరగగా.. రబీలో 89 వేల హెక్టార్లలో జరగవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మినుము, పెసర, మొక్కజొన్న, పత్తి తదితర పంటలకు కూడా రైతులు ఏర్పాట్లు చేస్తున్నారు.



నారుమడులకు వరి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

స్కిల్ హబ్స్‌లో నిరుద్యోగులకు శిక్షణ

కాకినాడ సిటీ: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటి ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా సర్టిఫికెట్ జారీ చేస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు స్కిల్ హబ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఇన్‌స్టలేషన్ కంప్యూటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులలో శిక్షణ ఇస్తారు. కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ శిక్షణ ఇస్తారు. అలాగే, పిఠాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ ఉంటుంది. సామర్లకోట ఎస్‌పీసీ శిక్షణ కేంద్రంలోని స్కిల్ హబ్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆఫీసు అసిస్టెంట్, జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆఫీసు అసిస్టెంట్, వెబ్ డెవలపర్ కోర్సులలో శిక్షణ ఇస్తారు.

రేపు ఏకసభ్య కమిషన్ రాక

కాకినాడ సిటీ: షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ బుధవారం కాకినాడ రానున్నది. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా సభ్యుడిగా ఉన్న ఈ కమిషన్ రెండు రోజుల పాటు కాకినాడలో పర్యటిస్తుందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి సోమవారం విలేకర్లకు తెలిపారు. జిల్లా యంత్రాంగంతో సమావేశం కావడంతో పాటు వివిధ ఉప కులాల సభ్యులు, సంఘాలతో కమిషన్ సమావేశమై, వినతులు స్వీకరిస్తుందని వివరించారు. వీటిని పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తుందన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో, విద్యా సంస్థల్లో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గాల ప్రాతినిధ్యాన్ని, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా వారి వెనుకబాటును పరిశీలిస్తుందని వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కమిషన్‌కు సూచనలు, వినతులు ఇవ్వదలచిన వారు వాస్తవాల ధ్రువీకరణ పత్రాలతో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోగా కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరానికి రావాలని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు.

'ఆపరేషన్' అబ్రకదబ్ర!

- ప్రభుత్వ ఆస్పత్రిలో గుండె వైద్య యంత్రాన్ని సొంత క్లినిక్‌కు మళ్లించిన కాంట్రాక్ట్ వైద్యుడు
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొద్ది రోజులకే యథాస్థానంలోకి యంత్రం
- విధుల నుంచి తొలగించిన అధికారులు
- తదుపరి చర్యలకు కలెక్టర్‌కు నివేదించనున్న వైనం




మాయమై కొద్దిరోజులకే ప్రత్యక్షమైన డెఫిబ్రిలేటర్ యంత్రం

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుండె వైద్యానికి వినియోగించే డెఫిబ్రిలేటర్ అనే యంత్రం మాయమైంది. ప్రభుత్వం సమకూర్చిన రూ.1.50 లక్షల విలువైన ఈ యంత్రం మాయం కావడంతో ఆస్పత్రి వైద్యుల్లోనే కాకుండా సిబ్బందిలో కలకలం రేగింది. తీరా ఈ యంత్రం ఏమైంది...? ఎక్కడుంది...? ఎవరు తీసుకెళ్లారు...? అని ఆరా తీస్తే అదే ఆస్పత్రిలో కాంట్రాక్ట్ వైద్యుడిగా పనిచేస్తున్న ఓ డాక్టర్ చాటుగా తీసుకుని వెళ్లి పట్టణంలోనే తన సొంత ఆస్పత్రిలో పెట్టుకున్నట్టు ప్రాథమిక విచారణతో తేలింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ఈ యంత్రం మాయంపై నాలుగు రోజుల కిందటే విచారణ నిర్వహించారు. నివేదికను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కార్తీక్‌కు అందించారు. అప్పటికే ఆ కాంట్రాక్ వైద్యుడు విధులకు సక్రమంగా హాజరు కావడంలేదన్న ఆరోపణలు ఉన్న క్రమంలో ఇప్పుడు గుండె వైద్య యంత్రాన్ని పట్టుకెళ్లిపోయారన్న అభియోగం తోడు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కార్తీక్ ఆయనను విధుల నుంచి తప్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు కూడా తమ ఆస్పత్రిలో యంత్రం చోరీ అయినట్లు పట్టణ సీఐ పి.వీరబాబుకు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వచ్చి విచారించారు. పోలీసుల విచారణ నేపథ్యంలో ఆ కాంట్రాక్ట్ డాక్టర్ తాను తీసుకువెళ్లిన ఆ యంత్రాన్ని మళ్లీ ఆస్పత్రిలో యథాస్థానంలో ఉంచారు. ఆ కాంట్రాక్ట్ డాక్టర్ పరువును దృష్టిలో పెట్టుకుని పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు 'సాక్షి'కి తెలిపారు. ఆ డాక్టర్ ఆస్పత్రిలో సెక్యూరిటీ వ్యక్తితో కుమ్మక్కై యంత్రాన్ని తీసుకువెళ్లి తన సొంత క్లినిక్‌లో పెట్టుకున్నారని చెప్పారు. ఫలానా కాంట్రాక్ట్ డాక్టర్ ఆ యంత్రాన్ని తీసుకువెళ్లిపోయారని సాక్ష్యం చెప్పిన ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బందిపై రౌడీలు స్థానిక బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి దాడి చేశారని తెలిపారు. ఆస్పత్రిలో యంత్రం మాయం, దానికి బాధ్యుడైన కాంట్రాక్ట్ డాక్టర్‌పై నివేదిక కలెక్టర్‌కు అందిస్తున్నామని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కార్తీక్ 'సాక్షి'కి తెలిపారు.

ఆగని ఎన్నికల స్టంట్

- నేడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎలక్షన్లు
- తూర్పు, మధ్య డెల్టాల్లో 25 డీసీలు
- వీటి నుంచే ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎంపిక



గోదావరి డెల్టాలోని లొల్ల లాకులు

సాక్షి, అమలాపురం: సాగునీటి సంఘాల్లో ముఖ్యమైన డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ)లకు మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. డీసీ చైర్మన్లుగా ఎన్నికైన వారిలో ఒకరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అయ్యే అవకాశమున్నందున ఈ ఎన్నికలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి, ఏలేరు ప్రాజెక్టు కమిటీలతో పాటు మీడియం, మైనర్ ప్రాజెక్టుల పరిధిలో నీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. వీటిలో గోదావరి ప్రాజెక్టు కమిటీ అతి పెద్దది. రాష్ట్రంలోని ప్రాజెక్టు కమిటీల్లో కూడా ఇది కీలకమైంది. ఈ ప్రాజెక్టు కమిటీ పరిధిలో ఇప్పటికే వాటర్ యూజర్స్ అసోసియేషన్ల (డబ్ల్యూయూఏ) ఎన్నికలు పూర్తయ్యాయి. ప్రభుత్వం తమకు కావలసిన వారిని దొడ్డిదారిన ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

కొన్ని డబ్ల్యూయూఏలు పక్క జిల్లాల్లో..

గోదావరి ప్రాజెక్టు కమిటీ ఉమ్మడి జిల్లాలో విస్తరించి ఉంది. మొత్తం 25 డీసీలు ఉండగా కోనసీమ జిల్లాలోనే 16 ఉన్నాయి. తూర్పు డెల్టా పరిధిలో ఆలమూరు, కోటిపల్లి, కూళ్ల, రామచంద్రపురం, యర్రపోతవరం, మండపేట డీసీలున్నాయి. సెంట్రల్ డెల్టాలో అల్లవరం, అవిడి, గోపాలపురం, కాట్రేనికోన, అమలాపురం, అయినవిల్లి మురమళ్ల, పి.గన్నవరం, రాజోలు, ఉప్పలగుప్తం డీసీలు; కాకినాడ జిల్లాలోని తూర్పు డెల్టాలో కాకినాడ, కరప, కాజులూరు, సిరిపురం, తాళ్లరేవు, పిఠాపురం బ్రాంచ్ కెనాల్–1, పిఠాపురం బ్రాంచ్ కెనాల్–2 డీసీలు; తూర్పు గోదావరిలో కొమరిపాలెం, అనపర్తి డీసీలున్నాయి. కొన్ని డీసీల పరిధిలోని డబ్ల్యూయూఏలు పక్కనే ఉన్న జిల్లాలో ఉండటం గమనార్హం.

◆ కోనసీమలోని ఆలమూరు డీసీ పరిధిలో తూర్పు గోదావరి జిల్లా వేమగిరి డబ్ల్యూయూఏ; కాకినాడ జిల్లా సిరిపురం డీసీ పరిధిలో కోనసీమ జిల్లాలోని వెల్ల, యనమదురు డబ్ల్యూయూఏలు ఉన్నాయి.

కోనసీమదే హవా

డెల్టాలోని మొత్తం 25 డీసీల్లో తూర్పు గోదావరిలో 2, కాకినాడలో 7, కోనసీమ జిల్లాలో 16 డీసీలు ఉన్నాయి. దీంతో సంఖ్యాపరంగా అధిక డీసీలు ఉన్న కోనసీమ జిల్లా వారు సహజంగానే ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఆశించనున్నారు. గతంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా తూర్పు డెల్టా పరిధిలో మండపేట నుంచి రెడ్డి బ్రాహ్మణ చౌదరి, తర్వాత మధ్య డెల్టా పరిధిలో రాజోలు నుంచి భూపతిరాజు ఈశ్వర్‌వర్మ ఎన్నికయ్యారు. వీరిద్దరూ కోనసీమ జిల్లా వాసులే కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో కోనసీమ(మధ్య డెల్టా)లో 9 డీసీలుండేవి. కొత్తగా జిల్లా ఏర్పడిన తరువాత మండపేట, రామచంద్రపురం (కాజులూరు మినహా) నియోజకవర్గాలు కోనసీమలో భాగమయ్యాయి. అలాగే నీటి సంఘాలలో ఇదే జిల్లా నుంచి కొత్తగా ఉప్పలగుప్తం డీసీ ఏర్పడింది. దీంతో జిల్లాలో ఏకంగా 16 డీసీలతో ప్రాజెక్టు కమిటీని శాసించే స్థాయిలో ఉంది. నేడు ఎంపిక చేసే డీసీ చైర్మన్‌లను సహితం అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎంపిక చేయనున్నారు. అలా చేసిన వారినే డబ్ల్యూయుఏలు ఎంపిక చేయడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. దీంతో ఈ ఎలక్షన్లు సైతం సెలెక్షన్‌గానే మారనున్నాయి.

జనసేనకు ముందుగానే కళ్లెం

మిత్రపక్షం జనసేన గోదావరి ప్రాజెక్ట్ కమిటీ ఆశలకు టీడీపీ ముందుగానే కళ్లెం వేసింది. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు దేవుడెరుగు అసలు డీసీ చైర్మన్‌ల అవకాశాలు కూడా లేకుండా చేసింది. కేవలం డబ్ల్యూయూఏల్లో మండలానికి ఒకటి రెండింటికి మాత్రమే పరిమితం చేసింది. కోనసీమ జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్నచోట డబ్ల్యూయుఏలలో జనసేన పార్టీ ప్రస్తావన లేకుండా చేసేశారు. పేరుకు ఎన్నికలే అయినా అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన వారికి డబ్ల్యూయుఏలలో అధ్యక్ష పదవులు దక్కిన విషయం తెలిసిందే. రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లలో జనసేన పార్టీకి కనీసం రెండు డైరెక్టర్ పదవులు అయినా ఇస్తున్నారు. ఇక్కడ ఆ నిష్పత్తిలో సహితం పదవులు దక్కకపోవడం విశేషం. జనసేన ఎమ్మెల్యేలు ఉన్న పి.గన్నవరం, రాజోలు, కాకినాడ రూరల్ నియోజకవర్గాలలో సైతం ఆ పార్టీ నాయకులకు కనీసం సగం కూడా డబ్ల్యూయూఏలు రాకపోవడం విశేషం.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 - 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,500
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	10,000 - 11,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

సఖినేటిపల్లి: అంతర్వేదికర రావి వారి గ్రూపులో ఆదివారం తన చిన్నాన్న, పెంపుడు తండ్రి రావి వీర వెంకట నరసింహారావును ఆస్తి కోసం కొట్టి చంపిన కేసులో ముద్దాయి రావి రాంబాబును సోమవారం అరెస్ట్ చేసినట్టు ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు అన్నారు. ముద్దాయిని మలికిపురం మండలం దిండి వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్టు వద్ద అదుపులోకి తీసుకుని, మధ్యవర్తుల సమక్షంలో రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ అరెస్ట్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ఐటీ దాడులు



పెద్దాపురం లలితాలో సాగుతున్న సోదాల్లో ఐటీ అధికారులు

పెద్దాపురం: స్థానిక లలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఆదాయ పన్ను శాఖ (ఇన్‌కం టాక్స్) అధికారులు చేపట్టిన తనిఖీలు సోమవారం నాల్గవరోజు కొనసాగాయి. పారిశ్రామిక వేత్తలు మట్టే సత్య ప్రసాద్, మట్టే శ్రీనివాస్‌లకు సంబంధించి పరిశ్రమలు, బంధువులు, సిబ్బంది ఇళ్లలోనూ ఏకకాలంలో నిర్వహిస్తున్న తనిఖీలను సోమవారం ముమ్మరం చేశారు. సంస్థకు సంబంధించిన పలు కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. కొంతకాలంగా కొనుగోలు చేసిన భూములు, భవనాలకు సంబంధించిన వివరాలపై ఆరా తీసినట్లు సమాచారం.

స్థలం పట్టాలే పొట్టన పెట్టుకున్నాయా!

- ముగ్గురి దారుణ హత్యతో వేట్లపాలెంలో కొనసాగుతున్న పోలీసు పికెట్
- అధికారుల ఉదాసీనత హత్యలకు దారి తీసిందా అన్న వాదనలు

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం గ్రామం మంగాయ్యమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల పట్టాల విషయమై ఎనిమిదేళ్ల క్రితం వివాదం తలెత్తి సద్దుమణిగి పోగా, నేడు రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం హత్యలకు దారి తీసింది. అధికారుల స్పందనా రాహిత్యమే ఆదివారం జరిగిన హత్యాకాండలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయేలా చేసిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అప్పట్లో 17 పాకలు దగ్ధం

మాలచెరువు వద్ద ఎస్సీలు నివాసం ఉంటున్న 17 పాకలు ఎనిమిదేళ్ల క్రితం దగ్ధం అయ్యాయి. అనధికారికంగా సుమారు 80 మంది స్థలాల పట్టాలు తీసుకొని ఇళ్లు నిర్మించడంతో అప్పట్లో వివాదం ప్రారంభం అయింది. మాల చెరువు ఎస్సీలకు చెందినది కావడం వల్ల అక్కడ ఇతరులకు పట్టాలు ఇవ్వడానికి వీలు లేదని ఆందోళనకు దిగారు. దాంతో వివాదం తీవ్ర స్థాయికి చేరడంతో అప్పట్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అప్పటి తహసీల్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో సమస్యను పరిష్కరించి అనర్హులు ఇళ్లు నిర్మించకుండా నిలిపివేశారు. ప్రస్తుతం మాల చెరువు వద్ద ఇంటి నిర్మాణ వివాదం హత్యలకు దారి తీసి పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. దీనికి అధికారుల వైఫల్యమే కారణమా అనే వాదనలు వినిపిస్తున్నాయి.

11 ఆక్రమణల గుర్తింపు

మంగాయ్యమ్మ కాలనీలో కార్దాల కుటుంబానికి చెందిన వారు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించిన సమయంలో ఈ ఏడాది ఆగస్టు 14న తహసీల్దార్‌కు బత్సల కుటుంబానికి చెందిన వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా సెప్టెంబర్ 22న గ్రామసభలో రెండో దఫా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో దీనిపై సర్వే చేయించి సమస్యను పరిష్కరించుకోవాలని పంచాయతీ కార్యదర్శి వి. సునీల్‌కుమార్‌కు తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దాంతో సర్వే పూర్తయ్యే వరకు ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయడానికి వీలు లేదని పంచాయతీ నుంచి మూడు నోటీసులు జారీ చేశారు. అనంతరం సర్వే చేయించారు. మాలచెరువు వద్ద స్థలంలో 11 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు కార్దాల కుటుంబానికి చెందినవారు ఇల్లు నిర్మించడానికి వీలు లేదని మహిళా పోలీసు, గుమాస్తా ద్వారా హెచ్చరిక జారీ చేసినట్టు పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం కార్దాల కుటుంబ సభ్యులు ఇంటి శ్లాబ్ పనులు ప్రారంభించారు. ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న వారిపై బత్సల వర్గీయులు కత్తులతో దాడికి దిగారు. ఈ ఘటనలో కార్దాల చంద్రరావు, కార్దాల ప్రకాశరావు, కార్దాల ఏసు మృతి చెందిన విషయం విదితమే.



వివాదాస్పదంగా మారిన ఇంటి నిర్మాణం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు కాపలా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి సమాచారం సేకరిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ శ్రీనివాసు

పాత కక్షలే కారణమా?

ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో వేట్లపాలెం గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం ఏర్పడే వరకు గుంపులు, గుంపులుగా తిరగడానికి వీలు లేదని హెచ్చరికలు జారీ చేశారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్దాల దావీదు, పండు, సంజీవరాజు, బాబీ, సత్యవేణిల నుంచి డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసు ద్వారా సమాచారం సేకరించారు. అధికారులు సకాలంలో స్పందిస్తే హత్యలు జరిగి ఉండేవి కాదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ హత్యలకు పాత కక్షలు కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు వర్గాల మధ్య మూడు నెలలుగా వివాదం జరుగుతూ ఉంటే విషయం పోలీసుల దృష్టికి రాకపోవడం వింతగా ఉంది. ఇంటి నిర్మాణం నిలిపి వేయాలని మహిళా పోలీసు హెచ్చరిక జారీ చేసినా పనులు సాగుతుంటే పోలీసుల దృష్టిలో ఎందుకు పెట్టలేదనే ప్రశ్న తలెత్తుతోంది. దాడి చేసిన వారిలో కొంతమందిని పోలీసులు గుర్తించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.



మృతులు కార్దాల ఏసుబాబు, కార్దాల చంద్రరావు, కార్దాల ప్రకాశరావు (పాత చిత్రాలు)



వేట్లపాలెం చేరిన శవ పేటికలు



శ్మశాన వాటికలో రోదిస్తున్న బంధువులు

ముగిసిన అంత్యక్రియలు

మృతదేహాలు సోమవారం రాత్రి 6.30 గంటలకు గ్రామానికి చేరాయి. దీంతో మంగాయ్యమ్మ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు మృతదేహాల వద్దకు పరుగులు తీస్తూ బోరున రోదించడంతో ఉద్విగ్న వాతావరణం ఏర్పడింది. వారు గుండెలు బాదుకొంటూ రోదించిన తీరు స్థానికుల హృదయాలను కలచివేసింది. వేట్లపాలెంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ డి.శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణ పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పోలీసు బలగాల మోహరింపుతో రైల్వే పట్టాల సమీపంలో ఉన్న శ్మశానంలో రాత్రి 7.10 మృతదేహాలను పేటికలతో సహా పూడ్చి వేశారు.



శ్మశాన వాటికకు మృతదేహాలను తీసుకువెళుతున్న బంధువులు

మట్టి ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



పెద్దేవం వద్ద మట్టి ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన రాజు

తాళ్లపూడి: ఇటుక బట్టీలో మట్టిని తొక్కే ట్రాక్టర్ బోల్తా పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన సోమవారం పెద్దేవం వద్ద చోటుచేసుకుంది. తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలం పెద్దేవం బల్లిపాడు గ్రామాల మధ్య ఉన్న ఇటుక బట్టీలో పనిచేసేందుకు తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దుంపల రాజు (34) వెళ్లాడు. అతను మట్టిని తొక్కే సమయంలో పక్కనే ఉన్న ఇటుక బట్టీలో ట్రాక్టర్ కూరుకుపోయిందని దాని యజమాని చెప్పగా అతనికి సాయం చేసేందుకు వెళ్లిన రాజు అక్కడి ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతుడు రాజుకు భార్య, ఏడాది వయసు గల బాబు ఉన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు తరలించారు.

మహిళ మృతిపై కేసు నమోదు



శృతి (ఫైల్)

రావులపాలెం: ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన ఘటనపై రావులపాలెం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. 2019లో రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన మామిడిచెట్టు వెంకన్న బాబుతో శృతి(25)కి వివాహం అయ్యింది. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో శృతి ఆదివారం రాత్రి ఉరివేసుకుని చనిపోయింది. పోలీసులు మృతదేహాన్ని కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వేమగిరికి చెందిన శృతి తండ్రి కొప్పిశెట్టి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంటి సోమవారం తెలిపారు.

టిప్పర్ టైర్ కింద పడి వ్యక్తి మృతి

కిర్లంపూడి: స్థానిక సత్యదేవ కల్యాణ మండపం వద్ద టిప్పర్ టైర్ కిందపడి సోమవారం వ్యక్తి మృతి చెందాడు. బంధువుల తెలిపిన వివరాల ప్రకారం ముక్కొల్లు గ్రామానికి చెందిన మేడిబోయిన నందీశ్వరరావు(53) తన భార్య, మనవడితో కలిసి స్కూటీపై, అల్లుడు - కూతురు మరో బైక్‌పై సినిమా చూసేందుకు కిర్లంపూడి వస్తున్నారు. కిర్లంపూడిలోని సత్యదేవ కల్యాణ మండపం సమీపంలో ఎదురుగా బెల్లం పేనంమట్టు వేసుకెళ్తున్న రిక్షాను ఢీకొని ప్రత్తిపాడు నుంచి సామర్లకోట వైపు వెళ్తున్న టిప్పర్ లారీ టైర్ కింద పడిపోయాడు. నందీశ్వరరావు తలపైకి లారీ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అల్లుడు దొడ్డి శేషాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ నాగళ్ల వెంకటరమణ తెలిపారు. మృతుడి భార్య, మనవడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, పెళ్లిఅయిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు కూలీపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.



లారీ టైర్ కింద నందీశ్వరరావు మృతదేహం

వినోదానికి వెళితే...విషాదం ఎదురైంది..

సినిమా చూసేందుకని అల్లుడు, కూతురు,మనవడు తన భార్యతో కలిసి ఆనందంగా వస్తున్న కొద్ది నిమిషాల్లోని మృత్యువు వెంటాడింది. మనవడితో సరదాగా మాట్లాడుకుంటూ వచ్చిన తన భర్త లారీ టైర్ కింద పడి విగతజీవిగా పడి ఉండడంతో గుండెలు బాదుకుంటూ ఆమెను బోరున విలపించింది. తన ఎదుటే తండ్రి మరణం, తల్లి రోదన చూసిన కూతురు శోక సముద్రంలో మునిగిపోయింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం



బెలూన్లను గాల్లో ఎగరవేసి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న కమాండెంట్ దీపిక



ఏపీఎస్పీలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభ సూచకంగా క్రీడాకారులు మార్చ్‌పాస్ట్

- ఏపీఎస్పీ కమాండెంట్ దీపిక
- స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం

కాకినాడ రూరల్: విధి నిర్వహణలో భాగంగా నిత్యం పని ఒత్తిడితో ఉండే ఏపీఎస్పీ సిబ్బందికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని కమాండెంట్ ఎం.దీపిక పేర్కొన్నారు. రమణయ్యపేటలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్ మీట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజులు జరగనున్న ఈ మీట్‌ను కమాండెంట్ బెలూన్లను గాలికి విడిచిపెట్టి ప్రారంభించారు. గేమ్ మీట్‌కు చిహ్నంగా శాంతి కపోతాలను గాలిలో విడిచిపెట్టారు. బెటాలియన్‌లో గల 7 కంపెనీల స్పోర్ట్స్ టీమ్‌లు మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించి ఆకట్టుకున్నాయి. క్రీడాకారులను నుంచి గౌరవ వందనం స్వీకరించిన కమాండెంట్ దీపిక మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో పని ఒత్తిడితో కుటుంబ సభ్యులకు దూరంగా ఉద్యోగాలు చేసే సిబ్బందికి స్పోర్ట్స్, గేమ్స్ ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఐపీఎస్ అధికారి సుస్మిత, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్‌లు మురళీకుమార్, మోహనరావు, చంద్రశేఖరరావు, మన్మథరావు, యూనియన్ మెడికల్ ఆఫీసర్లు, ఆర్‌ఐలు, సిబ్బంది, ఏపీఎస్పీ స్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు. పరుగు, వాలీబాల్, త్రో బాల్ పోటీల్లో తొలి రోజు ఏపీఎస్పీ సిబ్బంది ఉత్సాహంగా తలపడ్డారు.

మామిడి పూతకు మంచు కోత

- యాజమాన్యమే శరణ్యం
- ఉమ్మడి తూర్పుగోదావరిలో 31,089 ఎకరాల్లో సాగు
- అధికమవుతున్న పెట్టుబడులు


తుని రూరల్: మామిడి తోటలను మంచు దుప్పటి కప్పేస్తోంది. రాత్రి వేళల్లో కురుస్తున్న మంచు, తరుచూ సంభవిస్తున్న తుపాన్ల ప్రభావంతో సోకే తెగుళ్లు, ఆశించే పురుగుల కారణంగా మామిడి తోటలపై రైతులు అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా ఏ మేరకు దిగుబడులు లభిస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 13,482 మంది రైతులు 31,089 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా మెట్ట ప్రాంతంలోనే సాగవుతోంది. సాధారణంగా రెండు విడతల్లో మామిడి పూత వస్తుంది. డిసెంబర్, జనవరి మధ్య పూత వచ్చి ఆ తర్వాత పిందెలు రావాల్సి ఉంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎక్కడా పూత కనిపించడం లేదు. మొక్కతోటల్లో అరకొరగా కనిపిస్తోందని, ఇది ఒకటి, రెండు శాతం కంటే ఎక్కువ ఉండదని రైతుల నుంచి అందిన సమాచారంతో తెలుస్తోంది. కొంతమంది చిన్న, సన్నకారు రైతులు ఫలసాయానికి ముందుగానే తోటలను ఎకరా రూ.12 వేల నుంచి రూ.15వేల కౌలుకు విక్రయిస్తున్నారు. మొదట విడతలో పూత కనిపించకపోయినా వాతావరణంలో వచ్చే మార్పుతో రెండో విడతలో పూత విచ్చుకునే అవకాశం ఉందని ఉద్యాన అధికారులు తెలిపారు. చీడపీడలను నివారించి, మేలైన యాజమాన్య పద్ధతులు చేపడితే నాణ్యతగల మంచి దిగుబడులు లభిస్తాయని ఉద్యాన అధికారులు పేర్కొన్నారు.

దిగుబడులను కమ్మేస్తున్న వాతావరణం

మామిడి దిగుబడులపై తరుచూ సంభవిస్తున్న తుపాన్లు, శీతల పరిస్థితులు ప్రభావం కమ్మేస్తోంది. సాధారణంగా హెక్టారుకు పది మెట్రిక్ టన్నుల దిగుబడి లభించాల్సి ఉంది. మంచు, తెగుళ్లు, పురుగుల దాడితో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు తెలిపారు. దిగుబడులు తగ్గితే ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు క్షీణించి, సామాన్యులకు మామిడి రుచులు దూరమయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో ప్రధానంగా బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, తోతపూడి (కలెక్టర్), పందూరి మామిడి తదితర రకాలు పండిస్తున్నారు. కొత్తపల్లి కొబ్బరి, పందూరి మామిడి పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. తోతపూడి రకం మామిడి పండ్లను శీతల పానియాలు తయారు చేసే కార్పొరేట్ కంపెనీలు సేకరిస్తుంటాయి. మామిడి తాండ్ర తయారీలోనూ అధికంగా వినియోగిస్తారు.



లోవకొత్తూరులో బూజు తెగులు సోకిన మామిడి



తాళ్లూరులో సాగవుతున్న మామిడి తోటలు

ఆశించే చీడపీడలు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మామిడిని తేనెమంచు, మొగ్గ తొలుచు పురుగులు, పక్షి కన్ను, బూడిద, మసి తెగులు సోకే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పాడి-పంట

నివారణ చర్యలు

క్లోరిఫైరిపాస్ 50 ఈసీ ఒక మిల్లీలీటరు లేదా లాన్డు సైహలోత్రిక్ ఒక మిల్లీ లీటరు లేదా సైపనోటోరం ఒక మిల్లీ లీటరు, క్లోరోథలోనిత్ రెండు మిల్లీ లీటర్లు గాని నల్ల గంధం మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం లభిస్తుందన్నారు.

పచ్చి పూత దశలో..

పచ్చిపూత దశలో పూత నిలవడానికి సకాలంలో మందులు పిచికారీ చేస్తే సత్ఫలితాలు లభిస్తాయి. ప్రాపినోఫాస్ 50 ఈసీ రెండు మిల్లీ లీటర్లు లేదా డైమిథోయేట్ 30శాతం ఈసీ రెండు మిల్లీలీటర్లు లేదా ఇమిడోక్లోప్రిడ్ 17.80 శాతం ఎస్ఎల్ 0.5 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటిలో కలిపి కొమ్మలు బాగా తడిచేటట్టు పిచికారీ చేయాలి. వేప నూనె రెండు మిల్లీ లీటర్లు, హెక్సకొనోజోల్ రెండు మిల్లీలీటర్లు లేదా కార్బండిజం మూడు గ్రాములు, మ్యాంగో జెడ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పూమొగ్గలను ఉత్తేజపర్చడానికి

పూత త్వరగా రప్పించేందుకు, ఆడపూల శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ పది గ్రాములు, బోరాన్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఉమ్మడి జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం		
జిల్లా	మామిడి విస్తీర్ణం(ఎకరాల్లో)	రైతుల సంఖ్య
కాకినాడ	17,912	8,782
తూర్పుగోదావరి	12,905	4,349
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	242	351
మొత్తం	31,089	13,482

పెట్టుబడులు అధికమయ్యాయి



పూత, పిందెలు వచ్చేందుకు, తెగుళ్లు, పురుగుల నివారణకు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. హెక్టారుకు రూ.50వేలకుపైగా పెట్టుబడి అయ్యింది. ఇప్పుడిప్పుడే పూత వస్తోంది. పిందెలు నిలవడానికి, కాయలను నాశనం చేసే పురుగులను అంతమొందించడానికి ఇంకా మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. కోత, రవాణా చార్జీలకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు, గిట్టుబాటు ధర లభిస్తే పెట్టుబడి నష్టాలను అధిగమించి కొంతమొత్తం లాభాలు వస్తాయి.

– గణేసుల వీరబాబు, మామిడి రైతు, తేటగుంట

యాజమాన్య పద్ధతులు సత్ఫలితాలిస్తాయి



మామిడిలో నాణ్యత, అధిక దిగుబడులు సాధించేందుకు మేలైన యాజమాన్యమే సత్ఫలితమిస్తుంది. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలతో సకాలంలో తెగుళ్లు, పురుగులను నివారించాలి. నాణ్యత గల దిగుబడులు సాధిస్తే మంచి గిట్టుబాటు ధర లభిస్తుంది. మార్కెట్ అవసరాలకు అనువుగా కోత కోసి మామిడి విక్రయాలు, ఎగుమతులు చేయాలి.

– పి.అరుణ్‌కుమార్, హెచ్‌ఓ, శంఖవరం, తుని ఇన్‌చార్జి